# పరివర్తన

రచన:
కుమారి బలుసు సరళ

గేటుముందు ఆగిన బండినుండి దిగాడు ర.

ఎద్దుల సవ్వడి విన్న మంజుల కిటికీలోనుండి తొంగి చూచింది.

సన్నగా, ఎత్తుగా, చామనచాయతో నున్న రవి బండి దిగి లోపలికి రావడం గమనించి ఆమె ప్రక్కకి తొలిగింది.

హాలులోనికి అడుగుపెట్టిన రవి ఆశ్చర్యపోయాడు. 'ఇంటిలో అలికిడి లేదే! ఎవరూ లేరా?' బయటికి అనేశాడు.

'వారు ఊరిలో లేరండి!' సన్నటి గొంతుకతో తలుపు చాటునుండి సమాధాన మిచ్చింది మంజుల.

అపరిచిత కంఠ రవిని క్షణకాలం విస్మయం చెంది 'మా బాబాయి ఎక్కడికి వెళ్ళాడండీ?' ప్రశ్నించాడు రవి.

'వారు ఖమ్మం వెళ్ళారు.'

'ఎప్పుడు వస్తాడో?'

'బహుశాః రాత్రికి రావచ్చు. మీ...రూ...?' అర్థోక్తిలో ఆపింది మంజుల.

'నేను రామయ్యగారికి అన్నకొడుకునండీ! మరీ... మీ...రూ...?' అయోమయంగా ప్రశ్నించాడు రవి.

'నేనా? వారి శ్రీమతిని!' సిగ్గుతో సమాధాన మిచ్చింది ఆమె.

నిర్విణ్ణు డయ్యాడు రవి.

'కాళ్ళు కడుగుకోండి.' చెంబుతో నీరు అందిస్తున్న మంజులను చూసి, తేరుకుని, ఆమె చేస్తున్న అతిథి సత్కారాలను సేవిస్తూ, ఆలోచనలో పడ్డాడు.

'బాబాయి మళ్ళీ పెండ్లి చేసుకున్నాడా? అయినా... ఇంత వయసులో... అరవై ఏండ్ల వయసులో వున్న బాబాయి... ఇరవై సంవత్సరాల యువతిని పెండ్లి చేసుకోవడమా? ఘోరం!'

గుమ్మానికి ఆనుకుని నిలబడిన మంజులని పరీక్షగా చూశాడు పచ్చగా, బొద్దుగా విప్పారినబంతి పువ్వులా.. వుందనుకున్నాడు.

నాలుగు నిమిషాల కాలం ఇద్దరి మధ్య మౌనం రాజ్యం చేసింది.

అది భరించలేని రవి ముందుగా పలుకరించాడు. 'ఏమైనా పుస్తకా లున్నాయాండీ?'

'తెచ్చిస్తాను!' అంటూ కొన్ని వారపత్రికలు, రెండు నవల్సు ఇచ్చి, వంట ఇంట్లోకి వెళ్ళింది మంజుల.

రవి పుస్తకంలోని పేజీలు తిరగేస్తుండగా... 'అరే! ఎప్పుడొచ్చావు?' అంటూ పలుకరించిన తన బాబాయిని చూడగానే... అతనికి సంతోష మనిపించలేదు.

అడిగిన ప్రశ్నలకి ముభావంగానే సమాధాన మిచ్చాడు.

రాత్రి భోజనాలయిన తరువాత మాటల్లో రామయ్యగారు అన్నారు. 'రవీ! పదిహేనురోజుల వరకు నేను ఇంటికి రాను. కంట్రాక్టు పనులమీద హైద్రాబాద్ వెడుతున్నాను. నేను వచ్చేవరకు మీ పిన్నికి నువ్వే తోడుగా వుండాలి!'

తన బాబాయికి అంగీకారంగా తలాడించాడు రవి.

ఉదయం లేవగానే ఇల్లంతా కలియ చూశాడు.

'మీ బాబాయిగారి కోసమాండీ? వారు చీకటితోనే వెళ్ళిపోయారు!' మంజుల చిరునవ్వుతో సమాధాన మిచ్చింది.

ఆమె నవ్వు అతని మనసుకి హాయి నిచ్చినట్లంది.

రెండురోజులలో...రవి. మంజుల మధ్య పరిచయం బాగా పెరిగింది.

ఆ పరిచయం వారిద్దరి మధ్య...క్రమంగా-స్నేహంగా మారింది.

ఇద్దరిమధ్య చాలా కబుర్లు దొర్లుతుండేవి.

రాజకీయాలు, సినిమాలు, సాహిత్య విషయములు గురించి చర్చించుకుంటూ వుండేవారు.

నేటి సంఘ వాతావరణాన్ని, స్వార్థపూరితమైన కొందరి మానవుల నైజాన్ని విమర్శించేవాడు రవి.

రవి మాటలు మంజులను ఆకట్టుకున్నాయి. అతడంటే ఆమెకు వినలేని గౌరవం కలుగ జొచ్చింది.

ఒకరాత్రి రవికి నిద్ర మెలుకువ వచ్చింది, చుట్టూ పరికించి చూశాడు.

మంజుల హాలులోనే తనకు దూరంగా మంచంమీద పడుకుని, గాఢనిద్రలో వుండడం గమనించాడు.

కిటికీలోనుండి వీచిన చల్లనిగాలి రవి శరీరానికి తగిలి గిలిగింతలు పెట్టినట్టయింది. అతని శరీరం వేడికోసం, వెచ్చదనం కోసం విపించసాగింది.

నెమ్మదిగా లేచాడు. మంజులని సమీపించాడు.

ఆమె ముఖం మీదికి వంగాడు. అతని శ్వాస వేడిగా, ఆవిరిగా తగలడంతో...మంజులకి మెలుకువ వచ్చి చూసింది.

తనని అందుకోవాలనే కాంక్షతో వున్న రవిని చూడగానే కంగారు పడుతూ అడిగింది. 'మీరా? ఏమిటిది?'

'మంజూ! కదలకు! లేవకు! నీవు నాకు కావాలి! కాదనకు!'

'ఛీ! బుద్ధిలేదూ? ఇలాగేనా చేయడం?' కసిరింది మంజుల.

'మంజూ! నీ యవ్వన ప్రాయాన్ని ... ఆ ముసలాయనికి ధారపోయకు. నీకు తగిన ఈడుగల జోడీని నేను! ఎందు కలా వినుక్కుంటావు? నిన్ను నాదానిగ చేసుకుని, స్వర్గ సౌఖ్యాలు చవి చూపిస్తాను.' ఆమెకు నచ్చ చెప్పబోతు తున్నాడు రవి.

'మెడిసెన్ చదువుతున్న వాడివి! పరాయివాని భార్యను కోరడం మీకు ధర్మమా? అందులో...... నేను మీ చిన్నాన్న భార్యను!'

'హహ! చిన్నాన్న! తన కూతురు ఈడుగలదానివి భార్యగా పొందడం ఆయనకు ధర్మమా?' కసిగా అన్నాడు రవి.

'వారిని మీ రేమైనా...అంటే నేను సహించలేను. వారు నా భర్త! నా మెడలో తాళికట్టినవారు ..ఎలాంటి వారయినా...వారు నా దేవుడు! నా ప్రత్యక్షదైవం! నాపతికి నేను ద్రోహం చేయను. సీత, అనసూయ మొద లైన పతివ్రతామ తల్లులను ఆదర్శంగా పెట్టుకుని బ్రతుకు తాను. ఇంకెప్పుడూ...ఇలాంటి . పిచ్చి పనులు చేయ టానికి చూడకు.'

మంజూ! అనవసరంగా ఎందుకు వల్లిస్తావు ఈ కబుర్లు? తన స్వార్థం కోసం, తన సౌఖ్యం కోసం నిన్ను పెండ్లి చేసుకున్న ఆ ముసలాయన నీకు దైవమా? నీ నిండు జీవి తాన్ని బలిగొన్న వాడు...నీకు దేవుడా?

'మిమ్మల్ని నమ్మి, నాకు తోడుగా వుండమని వుంచి నందుకు...ఇదా మీ నిర్వాహము. చనువుగా వుంటు న్నాన్నుగదాని...నన్ను పతనం చేయాలనీ...నా పాతి వ్రత్యాన్ని మలిన పర్చాలనీ...చూస్తున్న మీ కంటె నీచుడు ఇంకొకడు వుండబోడు! మీరు స్వార్థపరులు! అందితే...అనుభవిద్దా మనుకునే రకం! ఛీ!'అసహ్యంతో చూసింది ఆమె.

రవి నిలద్రొక్కుకున్నాడు.

టేబులుమీద నున్న తన సూటుకేసుని అందుకుని వడివడిగా బయటికి నడిచాడు.

గేటు దాటుతున్న రవిని చూస్తూ నిశ్చేష్టురాలయింది మంజుల.

* ♦ *

వేసవికాలం రానే వచ్చింది. ఎండలు తీక్షణంగా కాస్తున్నాయి.

కాలేజీకి సెలవు లివ్వడంతో రవి తన స్వగ్రామం చేరు కున్నాడు.

సాయంత్రం చల్లటిగాలిలో మల్లె పందిరి క్రింద వాలు కుర్చీలో జారగిల బడ్డాడు.

మల్లెల మధుర వాసనలు రవికి మంజులని గుర్తింప చేశాయి. వెళ్ళి చూడాలనుకున్నాడు.

మరునాడు బయలుదేరి వెళ్ళాడు.

వసారాగడపలో నిలబడిన మంజుల చిరునవ్వుతో అతనిని ఆహ్వానించింది.' అబ్బా! ఎన్నాళ్ళకి దర్శన మిచ్చారు? ఈలోపుగా... నేను గుర్తే రాలేదా?'

రవి ఆశ్చర్య చకితుడయ్యాడు. 'ఆమె తనని క్షమిం చిందా? అప్పటి తన ప్రవర్తన ఆమె మర్చిపోయిందా? అతనికి కొంచెం సిగ్గు కలిగి నట్టయింది.

'మీ బాబాయిగారు ఊరిలో లేరు. వారు ఎప్పుడూ.. అంతేగా! నెలకి సగంపైగా రోజులు కేంపుల్లోనే వుంటారాయే! వారి దృష్టిని బాంక్ బాలెన్సు ఆకర్షించి నంతగా...మరేదీ...ఆ కట్టుకోదు. వ్యాపారపు దృష్టి మరి!' అంటూనే మంజుల గలగల నవ్వింది.

రవి కూడా ఆమెతో శృతి కలిపాడు. అతని హృద యం తేలికయినట్టయింది.

ఆ రాత్రి భోజనాలయిన తరువాత వసారాలో తన కని పరచిన మంచమీద విశ్రమించాడు.

మంజుల కోసం చాలా సేపు ఎదురుచూశాడు. వస్తే... సరదాగా కబుర్లు చెప్పుకుందామనీ!

నిరీక్షించి...ఎంతకీ రాకపోయేసరికి...నిద్రాదేవికి దాసుడయ్యాడు.

'రవీ! రవీ!' అని తట్టి, లేపుతున్నట్టయి కన్నులు తెరిచి చూశాడు.

మంజుల తన మంచంమీద కూర్చుని, తన కన్నుల లోకి...ఎదో....ఆశతో....కాంక్షతో....అర్థిస్తున్నట్లు వున్న...ఆమె నేత్రాలని చూడగానే అతను విస్మయం చెందాడు.' మంజులా! ఏమిటిలా?'

'రవీ! లేచి లోపలికిరా! చెబుతాను!'

ఆమెని అనుసరించి, గదిలో అడుగు పెట్టాడు.

'మీకోసమే అమర్చాను!' అంటున్న మంజుల మాట విని గదిని పరిశీలించి చూశాడు.

పట్టె మంచానికి అండమైన సిల్కు తెరలు వ్రేలాడు తున్నాయి. మంచంమీద పరచిన పువ్వుల దుప్పటినుండి కమ్మగా పరిమళం గదిని వ్యాపింప చేస్తోంది.

సమీపంలోనే అగరువత్తులు వెలిగించబడిన ప్లవరు వాజు!

రవికి అయోమయంగా తోచి, మంజులని కన్నుల తోనే ప్రశ్నించాడు.

'రవీ! ఇదంతా...మీకు అర్థం కావడంలేదా? ఆ రాత్రి...అర్థరాత్రి మీరు వెళ్లిన తరువాత... నేనెంతగా బాధపడ్డానో...మీకు ఎలా చెప్పను? మీ కోసం ఎంతగా నిరీక్షించానో...మీ కెలా అర్థమవుతుంది? నన్ను, నా

(తరువాయి 26వ పేజీలో)

# :: పరివర్తన ::

(గత సంచిక తరువాయి)

నా సుఖసుఖి మీద అర్పించుకోవాలని...ఎంతగా తపిస్తున్నానో...మీ కెలా తెలియపర్చను? రవీ! అతని కాళ్ళ మీద పడి ప్రార్థిస్తున్న మంజులని చూడగానే అతనికి తల తిరిగినట్టయింది.

మంజూ! వద్దు! వద్దు! నీ పాతివ్రత్యం చెడిపోతుంది. నిన్ను...పవిత్రంగా తప్ప...మరొక విధంగా చూడలేను. నన్ను వదులు!'

దూరంగా పోతున్న రవిని ఆమె విడువకుండా... అతనిలో కలసి పోవాలనీ, తీగలా అతనిని అల్లుకు పోతోంది.

కఠినంగా నిరాకరించినా...ఆమె విపరీతమైన కోరికతో...అతనిని అభ్యర్థిస్తోంది.'

'మంజులా! నీవు వివాహితవు! ఏ భర్తతో...నువ్వు సుఖంగా కాపురం చేసుకో ఇష్టం లేకపోయినా...తల వొగ్గి పెండ్లి చేసుకున్నావు. నీ తల్లి తండ్రుల పేదతనం నీకు...వయసు మళ్ళిన భర్తని ప్రసాదించింది నీవు నాతో కూడితే...నీతులను వల్లించే ఈ సంఘపు ప్రజలు...... నిన్ను వ్రేలెత్తి చూపుతారు, పతిత అంటారు, నీ వయసుకి తగిన ఈడుగల భర్త నీకు లభించకపోయినా... నీ జీవితం అన్యాయమయి పోయినా...మరి వారికేమీ పట్టదు, కసాయి. ఆ...హా...హ్హా...సంఘం! ఇతరులకి అంకుశాలు పెట్టే సంఘం...మరి అన్యాయాన్ని ఎందుకు ప్రతిఘటించదు? చెప్పు మంజూ? మరి చెప్పు? మంజూ!.' వెర్రెత్తిపోయిన రవి అప్పటి కప్పుడే...వెళ్ళిపోయాడు.

కటిక చీకటిలో...ఆ కారుచీకటిలో...కలిసి పోయాడు.

మంజుల కూలబడింది.

దట్టంగా క్రమ్ముకున్న మేఘాలు వర్షించి, తేలికయినట్టే ఆమె హృదయంలో జనించి, కట్టలు త్రెంచుకున్న కోరికలు...మరునాటి ఉదయభానుడికి ప్రభావంతో... కరిగిపోయాయి.

ఆమె తన భర్తతో అనుకూలవతిగా మసులుకుంటూంది

కానీ ..రవి పిచ్చివాడయి కసిగా అరుస్తూ తిరుగుతున్నాడు. 'ఈ సంఘం! కసాయి సంఘం! అన్యాయమయిపోయిన జీవితాన్ని......అలాగే...కుళ్ళి, కుళ్ళి ఏడుస్తూ...నోరు మూసుకుని, పడి గడపమంటుంది. సానుభూతి చూపదు! చేయూత నీయదు!

—కుమారి బల్లను సరళ




ఆ నాడు...
మహాత్మా గాంధి రామరాజ్యం ఆశించారు

ఈ నాడు...
రామ్‌రాజ్ నిట్టింగ్ ఫ్యాక్టరీవారు.

ప్రజల సుఖాన్ని కోరి:—

* అంబాసడర్ * టిప్‌టాప్
* రాజీన్ * పాండ్యడస్
* సంజ్జయ్ * బి–1
* సీ లార్డ్ * మెరీనా
* మైనర్.

మొదలగు రకాల బనియన్లను తయారించి ప్రజలకందించి వారు వాటిని ధరించి చిరకాలం సుఖంగా ఉండాలని కోరుతున్నారు.

వివరములకు

RAMRAJ KNITTING FACTORY
TULASI RAO STREET, : : TIRUPUR-4.